క్లుప్తంగా

బాలల హక్కులపై అవగాహన

కదిరి అర్బన్: పట్టణంలోని మశానంపేట యూపీ పాఠశాలలో మంగళవారం బాలల హక్కుల చట్టాలపై కానిస్టేబుల్ సౌభాగ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, డయిల్ 100, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు రుబియా, కృష్ణవేణి, భారతితో పాటు పలువురు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

బత్తలపల్లి: మీ వ్యాపారాల నిమిత్తం వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. మంగళవారం బత్తలపల్లి కూడలిలోని టీ స్టాల్, దుకాణాదారులు, తోపుడుబండ్ల నిర్వాహకులకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఎన్‌టీపీ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఎన్‌టీపీ మండల కార్యవర్గ సభ్యులు

తనకల్లు: ఎమ్మార్సీ కార్యాలయంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీపీ) మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రకాష్, గౌరవాధ్యక్షుడిగా మురళీధర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రామచంద్ర, ఆర్థిక కార్యదర్శిగా మహేశ్వర, మహిళా కార్యదర్శులుగా ప్రభావతి, సోని విక్రమ్ మున్నీసా, అదనపు కార్యదర్శులు రోజశ్రీ, అరుణమ్మ, రెడ్డెప్పనాయుడు, విశ్వనాథ్, పెద్ద రెడ్డెప్ప, సత్యనారాయణతో పాటు మరికొంత మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్‌టీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు ఘన సత్కారం



పోలీసులను సన్మానిస్తున్న ఎస్‌ఐ గోపీ

తనకల్లు: వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన హెడ్‌కానిస్టేబుళ్లు గౌడ, ప్రసాద్, మహిళా కానిస్టేబుళ్లు గౌరీ, ఉషారాణిలను మంగళవారం ఎస్‌ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సత్కరించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బదిలీ అయినవారు విధుల పట్ల చూపిన అంకితభావం, సమయపాలన, క్రమశిక్షణ అందరికీ ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు.

సేవలతోనే గుర్తింపు



హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

బత్తలపల్లి: ఉద్యోగులు చేసిన సేవలతోనే గుర్తింపు పొందుతారని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ పేర్కొన్నారు. బత్తలపల్లి నుంచి బుక్కపట్నం స్టేషన్‌కు బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ డీసీ లక్ష్మయ్యను పోలీసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సోమశేఖర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కదిరి డిపోలో నూతన ఆర్టీసీ బస్సులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనోద్దీన్‌తో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీపీఎంకు సన్మానం



సన్మాన సభలో మాట్లాడుతున్న దామోదరరాజు

చెన్నేకొత్తపల్లి: ఆమిదాలకుంట గ్రామంలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన దామోదరరాజుకు మంగళవారం ఆశాఖ అధికారులతో పాటు పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ నేతలు సానే రాజారెడ్డి, సానే ఉమారాణి, మేడాపురం సబ్ పోస్ట్ మాస్టర్ వెంకటనారాయణరెడ్డి, రిటైర్డ్ ఎస్‌పీఎం లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు దామోదరరాజు సేవలను కొనియాడారు.

వారపు సంత.. సమస్యల చింత

వారపు సంతలు సమస్యలకు నెలవుగా మారాయి. ఆదాయం ఉన్నప్పటికీ స్థానిక సంస్థలు సరైన వసతులు కల్పించడం లేదు. రోడ్డుపైనే క్రయవిక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనాలు ఎక్కడ తమను ఢీకొంటాయోనని వ్యాపారులు, కొనుగోలుదారులు బిక్కుబిక్కుమంటున్నారు.



పుట్టపర్తిలో వారపు సంత నిర్వహిస్తున్న దృశ్యం

- ఆదాయం ఉన్నా వసతులు సున్నా
- వారపు సంతలో తప్పని ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించని అధికారులు

పుట్టపర్తి టౌన్: కూరగాయలు తదితర నిత్యావసర సరుకులు లభించే వారపు సంతలపై మున్సిపల్, గ్రామపంచాయతీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ప్రత్యేకంగా దుకాణాలేవీ లేకపోవడంతో రోడ్డుపైనే అమ్మకాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. నీడ, నీరు తదితర మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో కదిరి – బుక్కపట్నం రహదారిపై శనివారం సంత నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు వేలాది మంది వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేస్తారు. ఎనుములపల్లి రహదారిపై మంగళవారం సంత జరుగుతుంది. ఇక్కడా రహదారికి ఇరువైపులా సంత నిర్వహించడంతో ప్రభుత్వ కార్యాలయాలు, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, ప్రశాంతిగ్రాంకు వెళ్లే వారు, పాదచారులు, వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలో బుక్కపట్నం, ముదిగుబ్బ, కదిరికి వెళ్లే రహదారులపైనే ప్రతి గురువారం సంత నిర్వహిస్తారు. నల్లమాడ మండల కేంద్రంలో కదిరి, ఓడీసీ, ముదిగుబ్బకు వెళ్లే రహదారులపై మంగళవారం సంత జరుగుతుంది. అమడుగూరు మండల కేంద్రంలోని బస్టాండులో ఆదివారం సంత నిర్వహిస్తారు. ఇక్కడ ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉంటోంది. మండుటెండల్లో సంత నిర్వహించడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రమాదం అని తెలిసినా...



ఎనుములపల్లి వారపు సంతలో రోడ్డుపైనే వ్యాపారం చేయాల్సి వస్తోంది. నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాలు అదుపు తప్పితే దుకాణాలపైకి దూసుకొస్తాయి. ప్రమాదమని తెలిసినా బతుకుదెరువుకోసం వ్యాపారం చేయక తప్పలేదు. సుంకం చెల్లిస్తున్నా.. అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదు. వారపు సంతను సరక్షిత ప్రాంతాలకు తరలిస్తే బాగుంటుంది.

– చంద్రకళ, వ్యాపారి

సౌకర్యాలు కరవు



ఎనుములపల్లి, పుట్టపర్తి వారపు సంతలో నుంచి వాహనాలు తిరుగుతుండడంతో కొనుగోలుదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం తాగునీరు అందుబాటులో లేదు. మరుగుదొడ్లు నిర్మించలేదు. సంతలో రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలలో సరుకులు కొనుగోలు చేయాలంటే ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందోనని భయపడాల్సి వస్తోంది. అధికారుల స్పందించి దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– కిష్టమ్మ, కొనుగోలుదారు, ప్రశాంతిగ్రాం

ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం



కర్ణాటకనాగేపల్లి, ఎనుములపల్లి రహదారులపై వారపు సంతలు నిర్వహించడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. పట్టణ రహదారులపై నిర్వహిస్తున్న వారపు సంతలను ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపడుతున్నాం. త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం.

– ప్రహ్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

‘సాగునీటి’ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



తనకల్లులో మాట్లాడుతున్న తహసీల్దార్ శోభా సువర్ణమ్మ



ధర్మవరంలో ఎన్నికల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ మహేష్

తనకల్లు: సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శోభా సువర్ణమ్మ ఆదేశించారు. తనకల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాగునీటి సంఘం ఎన్నికల పీఓలకు శిక్షణ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీ ప్రాజెక్టు), చిన్న రామన్నగారిపల్లి(సీఆర్ పల్లి), మల్లిరెడ్డిపల్లి, తిమ్మనాయునిచెరువు (కొక్కంటి), దిగువ చెక్కవారిపల్లి సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప, ఆర్‌ఐ మల్లికార్జున, ఇరిగేషన్ ఏఈ బయప్ప, పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిద్దామని ఆర్డీఓ మహేష్ అధికారులకు సూచించారు. మంగళవారం ధర్మవరంలోని షిర్డీసాయిబాబా గుడి వద్ద గల ఫంక్షన్ హాలులో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై డివిజన్‌లోని ఏడు మండలాల ఈఓ, ఏఈఓ, పీఎస్, ఏపీఓలకు శిక్షణ నిర్వహించారు. ఆర్డీఓతో పాటు ఇరిగేషన్ డీఈ మహేశ్వర్‌రెడ్డి, ఏఈ గురుప్రసాద్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 46 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంసిద్ధం కావాలన్నారు.

విధివిధానాలపై అవగాహన

కదిరి అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారులతో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ మురళీకృష్ణ, రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. మండలంలో 4 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 5న నోటిఫికేషన్ విడుదల కానుంది. 8న ఎన్నికలు జరుగుతాయని ఇరిగేషన్ ఏఈ మహేష్ తెలిపారు. ఎన్నికల విధివిధానాలపై శిక్షణలో వివరించినట్లు వెల్లడించారు.

సాగునీటి ఎన్నికల నిర్వహణపై శిక్షణ

తలుపుల : ఎంపీడీఓ కార్యాలయంలో కుర్లి, పెద్దన్నవారిపల్లి, పులిగుండ్లపల్లిలో నిర్వహించనున్న చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మంగళవారం తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతుల వివరాలు, ఎంతమంది సభ్యులను ఎలా ఎన్నుకోవాలి, వారిలో చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నికపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అనీల, ఆర్‌ఐ శ్రీనివాస్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి హరిత

తాడిమర్రి: గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులు హరిత, గోవర్ధన్‌నాయుడు సూచించారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశావర్కర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గర్భిణులను ఎప్పటికప్పుడు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. అలాగే కాన్పులు, అనారోగ్య సమయంలో 108 సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవమైతే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని గర్భిణులకు సూచించాలన్నారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన విద్యార్థుల ఆరోగ్య సమస్యల నమోదును త్వరగా పూర్తి చేయాలని ఆశాకార్యకర్తలకు సూచించారు.

వంద రోజుల ‘కార్యాచరణ’ను సవరించాలి



ఐక్యత ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

ఎన్‌పీకుంట: పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా రూపొందించిన 100 రోజుల ప్రణాళికలో సెలవు రోజులను మినహాయించే విధంగా సవరణ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ తయారు చేసిన వంద రోజుల ప్రణాళికను ప్రతి ఉన్నత పాఠశాలలో డిసెంబర్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి పదో తేదీ వరకు ఉదయం 9.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. శని, ఆదివారాల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సెలవు రోజులను మినహాయించి, సంక్రాంతి సెలవుల తరువాత ప్రత్యేక తరగతులు నిర్వహించే విధంగా మార్గదర్శకాలను సవరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామాంజులుయాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, మురళి, సందీప్, రహీం, షఫీ, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల నిర్వహణపై సమీక్ష

ఓడీచెరువు : మండల కేంద్రంలోని పల్లవి మండల సమాఖ్య కారాలయంలో స్వయం సహాయక పొదుపు సంఘా(ఎస్‌హెచ్‌జీ)లకు సంబంధించి పుట్టపర్తి నియోజకవర్గ క్లస్టర్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పీడీ కె.ఎస్.నరసయ్య హాజరయ్యారు. స్వయం సహాయక సంఘాల గ్రేడింగ్, రుణాల మంజూరు, సంఘం, గ్రామ సంఘం అప్‌డేట్స్, స్వయం సహాయక సంఘాల ఇన్‌కమ్ ప్రొఫైల్, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీ అంశాలపై సమీక్షించి,రివ్యూ తగు సూచనలు ఇచ్చారు.

షోకాజ్ ఉపసంహరించుకోండి

బత్తలపల్లి: వ్యాయామ ఉపాధ్యాయునికి ఇచ్చిన షోకాజ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని సత్యసాయి జిల్లా ఏపీఎస్ ఏపీఈఏ సంఘం నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏపీఎస్ ఏపీఈఏ సంఘం జిల్లా అధ్యక్షుడు లస్కర్ నాయక్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మడకశిర మండలం ఆమిదాలగొంది ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి చేతన్‌ను మేనమామ విరామ సమయంలో వచ్చి తీసుకెళ్లి దారుణంగా హత్య చేసిన సంఘటనకు బాధ్యులను చేస్తూ హెచ్‌ఎం జాబేజ్‌ను సస్పెండ్ చేయడం, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రసూనకు షోకాజ్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి



అమడగూరు బస్టాండులో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



విభిన్న ప్రతిభావంతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

తాడిమర్రి/ కదిరి అర్బన్/ తనకల్లు/ గాండ్లపెంట/అమడగూరు: దివ్యాంగులను హేళన చేయకుండా ప్రేమతో ఆదరించి, వారి అభిరుచికి తగ్గట్టు ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిసారని వక్తలు పేర్కొన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా బోధన చేస్తారని, తల్లిదండ్రులు పిల్లలందరినీ సమానంగా చూడాలని పిలుపునిచ్చారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తాడిమర్రిలో జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు, భవిత కేంద్రం ఉపాధ్యాయుల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివ్యాంగులపై ప్రేమ, దయ చూపాలన్నారు. వారికి ఉన్న అభిరుచులు, సామర్థ్యం మేరకు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయులు జీవరత్నం, ఐఈఆర్టీ మాధవ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

» కదిరి భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు. అనంతరం మానసధార స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ఎంఎస్ ప్రశాంత్ దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు, స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు అన్వేష్, సౌజన్య, షకీలా, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

» తనకల్లు ఎమ్మార్సీ కార్యాలయంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తే సాధారణ పిల్లల కన్నా ఎక్కువ ప్రతిభాపాటవాలు చూపుతారనాని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం వెంకటనారాయణ, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం ఫరీదా బేగం, ఐఈఆర్టీ మురళీకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

» విభిన్న ప్రతిభావంతులను సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని వక్తలు అభిప్రాయడ్డారు. గాండ్లపెంట భవిత కేంద్రంలో మంగళవారం ఎంఈఓ కృష్ణానాయక్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సిద్ధారెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు భారతి, దేవానందరెడ్డి, ఉపాధ్యాయులు రమేష్, ముంతాజ్ అలీ, గంగాధర్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

» అమడగూరులో దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారంగా ఏర్పడి, ప్లకార్డులు చేతపట్టుకుని, నినాదాలు చేశారు. ఎంఈఓ జిలాన్‌బాషా తదితర అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్య ధోరణి వీడండి

బత్తలపల్లి/ ధర్మవరం రూరల్/ ముదిగుబ్బ/ తలుపుల : సమాజంలో విభిన్న ప్రతిభావంతుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడి, వారిని కూడా సకలాంగులతో సమానంగా ఆదరిద్దామని ఎంఈఓ సుధాకర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని భవిత కేంద్రం, నార్త్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. ఆటపాటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ధర్మవరంలోని భవిత సెంటర్లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ గోపాల్‌నాయక్ హాజరయ్యారు. ముదిగుబ్బ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి ఎంఈఓ రమణప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీ బాబ్‌జాన్, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, రమాదేవి, శాంతి ఆనంద పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, కిషోర్, తులసి, కమల తదితరులు పాల్గొన్నారు. తలుపుల భవిత కేంద్రంలో ఎంఈఓ వెంకట్రాముడు ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, హెచ్‌ఎంలు శంకరన్న, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరం

ఎన్‌పీకుంట: భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరం లాంటివని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌పీకుంట సమీపంలోని భవిత కేంద్రంలో నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో వారు మాట్లాడారు. దివ్యాంగ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు వారిని తల్లిదండ్రులు భవిత కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శిరీషారెడ్డి, ఐఈఆర్టీలు కళావతి, శ్రీకాంత్, అంగన్‌వాడీ కార్యకర్త, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే దివ్యాంగులు ఏదైనా సాధిస్తారు

చెన్నేకొత్తపల్లి: దివ్యాంగులను ప్రోత్సహిస్తే వారు ఏదైనా సాధించగలరని ఎంఈఓ–2 ప్రసూన్‌కుమార్‌నాయుడు అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం చెన్నేకొత్తపల్లిలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భవితాకేంద్రం నుంచి దివ్యాంగులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కనగానపల్లి: విభిన్న ప్రతిభావంతులకు చేయూతనందించాలని ఎంఈఓ అరుణమ్మ తెలిపారు. కనగానపల్లి భవిత కేంద్రంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు.

బియ్యం సరిహద్దు దాటరాదు

అమడగూరు: మండలంలోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను సీఐ నరేంద్రరెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దులో 5 చెక్ పోస్టుల వద్ద బందోబస్తు నిర్వహించాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తాడిమర్రి: మద్దులచెర్వు సమీపంలో మంగళవారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపారు. గ్రామ సమీపంలోని ముళ్ల పొదళ్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో ఆమె సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.8,770 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

ఓడీచెరువు : పోలీసులు వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేయాలని సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. ఓడీచెరువు పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న ఏఎస్‌ఐ కిషోర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, పీసీలు నారాయణ స్వామి, సాయి, సోమును వారు ఘనంగా సన్మానించారు.

విద్యార్థిని అభినందించిన డీఈఓ



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ

పుట్టపర్తి టౌన్: ‘ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పొటెన్షియల్, కన్సర్న్స్’ అనే అంశంపై జరిగిన రాష్ట్రస్థాయి సెమినార్‌లో ద్వితీయ స్థానంలో నిలిచిన ధర్మవరం మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి లక్ష్మీనివాస్‌ను డీఈఓ కిష్టప్ప కొత్తచెరువులోని తన కార్యాలయంలో అభినందించారు. సర్టిఫికెట్, వెండి పతకం, బహుమతి అందజేశారు. విద్యార్థిని ప్రోత్సహించిన గైడ్ టీచర్ శ్రావణిని అభినందించారు. కార్యక్రమంలో ఏడీ నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి తనూజ పాల్గొన్నారు.

భూగర్భ డ్రెయినేజీకి ప్రతిపాదనలు

బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలో భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఈఓఆర్డీ క్రిష్టప్ప పేర్కొన్నారు. మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామితో కలిసి బత్తలపల్లిలో వీధులను పరిశీలించారు. జాంపుల అప్పస్వామి మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన మంత్రి వెంటనే స్థానిక అధికారులను అందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అధికారులు మండల కేంద్రంలో పరిశీలించి రూ.4 కోట్లు ఖర్చు అవుతుందని ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాంపుల అప్పస్వామి, పల్లపోతుల శ్రీరాములు తదితరులు ఉన్నారు.

వర్షానికి నేలకొరిగిన వరి



వేళ్లమద్ది వద్ద నేలవాలిన వరి పంట

నల్లమాడ: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలో పలుచోట్ల కోతకొచ్చిన వరి పంట నేలకొరిగింది. వేళ్లమద్ది వద్ద పూజారి సూరి, శీతారాం, దంపెట్ల రాంమోహన్, కొమ్ము హరిక్రిష్ణ, ఎం.గోవిందరెడ్డి, కొండకింద తండాకు చెందిన ఆర్.గేమేనాయక్, బాలాజీనాయక్, రమణప్ప తదితరులకు చెందిన సుమారు 50 ఎకరాల్లో వడ్లు రాలిపోయాయి. దీంతో ఎకరాకు రూ, 40 వేలకుపైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

ప్రేమ పేరుతో బాలికకు వేధింపులు

- ముగ్గురిపై కేసు నమోదు

కదిరి టౌన్: ప్రేమ పేరుతో వెంటపడి వేధిస్తున్న యువకుడు, అతడికి సహకరించిన మరో ఇద్దరు స్నేహితులపై కదిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గజ్జలరెడ్డిపల్లికి చెందిన సల్లా యోగీశ్వరయాదవ్ స్థానిక వాల్మీకి స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమిస్తున్నానంటూ ఆరు నెలలుగా వెంటపడుతున్నాడు. ఆ అమ్మాయి సున్నితంగా తిరస్కరించినా పట్టించుకోలేదు. స్నేహితులు జ్యోతిప్రకాష్, తారక్‌లతో కలిసి బజార్‌లో ఆ అమ్మాయికనిపిస్తే చాలు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఒత్తిడి తీసుకొస్తున్నాడు. కామెంట్లు చేయడం పరిపాటిగా మారిపోయింది. రోజురోజుకూ వేధింపులు పెరిగిపోతుండడంతో అమ్మాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు యోగీశ్వరయాదవ్, అతని స్నేహితులిద్దరిపైనా మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ఎన్‌పీకుంట: రబీలో రైతులు సాగు చేసే పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని పెడబల్లి, పి.కొత్తపల్లి రైతుసేవ కేంద్రాల పరిధిలో మంగళవారం ‘పొలం పిలుస్తోంది’ నిర్వహించారు.